క్లుప్తంగా

డెంగీపై అవగాహన అవసరం



అంగర పీహెచ్‌సీ వద్ద డెంగీపై అవగాహన కల్పిస్తున్న మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: డెంగీ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు అన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి.రత్న కుమారి ఆదేశాలపై శనివారం పీహెచ్‌సీ ఆవరణలో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులను విస్మరిస్తే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ బి.రామారావు మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను గుర్తించగానే ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శాశ్వత అన్నదానానికి విరాళం



అంగరలో స్వామి సన్నిధిలో విరాళం సొమ్ము అందజేస్తున్న దాత కుటుంబ సభ్యులు

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శాశ్వత అన్నదాన పథకానికి రాయవరం మండలం కూర్మాపురం గ్రామానికి చెందిన చొటపల్లి సూర్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన భార్య చక్రవేణి శనివారం రూ.25 వేల విరాళాన్ని అందజేశారు. స్వామివారిని దాత చక్రవేణి, కుమారుడు సూర్యనారాయణ, కోడలు చక్రవేణి దర్శించుకున్నారు. విరాళం సొమ్మును ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులకు అందజేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను దాత కుటుంబ సభ్యులకు అందజేశారు. దాతను అభినందించారు. అంగర, పడమరఖండ్రిక, వెదురుమూడి, తాతపూడి, కపిలేశ్వరపురం గ్రామాలకు భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రేపటి నుంచి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు (గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 వరకు) ఈ నెల 12 నుంచి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎన్‌వీ రామచంద్రపురమూర్తి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పారిశుధ్యం, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్రూటినీ, వీధిలైట్లు, పంచాతీయల విధులు తదితర అంశాలపై 12, 13, 14వ తేదీల్లో శిక్షణ ఇస్తారన్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిక్షణా తగతులకు మండలంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

మాచారెడ్డి కుటుంబానికి పరామర్శ



మొగలిపాలెంలో మాచారెడ్డిని పరామర్శిస్తున్న ఆదిత్య శేషారెడి తదితరులు

కాజులూరు: మండలంలోని మొగలిపాలెంలో మాతృ వియోగంతో బాధ పడుతున్న వైఎస్సార్ సీపీ సినియర్ నాయకుడు నల్లమిల్లి మాచారెడ్డి కుటుంబాన్ని ఆదిత్య విద్య సంస్థల అధినేత, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి శేషారెడ్డి దంపతులు శనివారం పరామర్శించారు. మాచారెడ్డి తల్లి సూర్యకాంతం (72) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. నల్లమిల్లి శేషారెడ్డి, భార్య లక్ష్మీరాజ్యం సూర్యకాంతం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే కోస్తాఆంధ్రా రెడ్డి సంక్షేమసంఘం అధ్యక్షులు కర్రి త్రినాథరెడ్డి, సప్తగిరి హెచరీస్ సంస్థల అధినేత సుబ్బారెడ్డి, తణుకువాడ పీఏసీఎస్ చైర్మన్ పితాని సుబ్రహ్మణ్యం తదితరులు మాచారెడ్డిని పరామర్శించారు.

ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలి

కాజులూరు: ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సమరసత సేవా ఫౌడేషన్ మండల కన్వీనర్ కంచి గోవిందు అన్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం తదితర గ్రామాల్లో శనివారం సమరసత సేవా ఫౌడేషన్ సభ్యులు ఇంటింటికీ స్టికర్లు అతికిస్తూ, కరపత్రాలు పంచుతూ ధర్మప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యావటంలో గోవిందు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అనేక దేశాలు ఆచరిస్తుంటే మన దేశంలో కొందరు పాశ్చాత్య పోకడలకు పోతున్నారన్నారు. మన ధర్మాన్ని, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మండల సమరసత సేవా ఫౌడేషన్ కార్యవర్గ సభ్యులు గరగ రాంబాబు, డి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరిసాగు

- పిలకలు వేసే దశలో పంట
- అక్కడక్కడా ఆశిస్తున్న మొవ్వుపురుగు
- సస్యరక్షణ చర్యలు చేట్టాలని సూచిస్తున్న అధికారులు



మొవ్వుకుళ్లు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతులు

రాయవరం: ప్రస్తుతం వాతావరణం ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంది. ఖరీఫ్ ప్రారంభం నుంచి వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఖరీఫ్ వరినాట్లు ముందుగానే ముగిశాయి. ప్రస్తుతం వరిపైరు పిలకలు వేసే దశలో ఉంది. ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా అక్కడక్కడా మొవ్వుపురుగు ఆశించడంతో పొటాషియం లోపం కన్పిస్తోంది. గత రబీలో దిగుబడులు బాగుండడంతో రైతులు ఖరీఫ్ సాగును మరింత ఉత్సాహంగా చేపడుతున్నారు. మరోసారి ఆశల సేద్యానికి పూనుకున్న రైతన్నలకు ప్రస్తుత వాతావరణ మార్పులను అధిగమిస్తే ఖరీఫ్ మరింత కలిసివస్తోంది.

1.01 లక్షల ఎకరాల్లో..

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రాయవరం, మండపేట, కపిలేశ్వరపురం, కె.గంగవరం, రామచంద్రపురం, కాజులూరు మండలాల్లో ఈ ఏడాది 1.01 లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. 80 శాతం మేర రైతులు స్వర్ణ రకాన్ని సాగు చేయగా 20 శాతం ఇతర రకాలను సాగు చేశారు. ఇంచుమించుగా జూలై నెలాఖరుకు వరినాట్లు పూర్తయ్యాయి. వరిపంట పిలకలు వేసే దశకు చేరింది. ఉక్కపోత వాతావరణం, అధిక ఉష్ణోగ్రతల కారణంగా అక్కడక్కడా మొవ్వపురుగు ఆశిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు.

మొవ్వుపురుగు లక్షణాలు

పురుగు లోపలికి వెళ్లి మొవ్వును తినేయడం వల్ల మొవ్వ చనిపోతుంది. రైతులు వాడుక భాషలో కాండం తొలిచే పురుగు, మొవ్వచావుగా పిలుస్తారు. వరి పిలక దశ నుంచి వెన్ను వచ్చే దశలో ఈ పురుగు ఆశిస్తుంది. మొవ్వ పురుగు పిలక దశలో అక్కడక్కడా ఆశిస్తే పెద్దగా నష్టం ఉండదు. అధికంగా ఆశిస్తే మాత్రం దిగుబడులపై ప్రభావం చూపుతుంది. వెన్నుదశలో మొవ్వ పురుగు ఆశిస్తే రైతు పరిభాషలో తెల్లకంకులుగా పిలుస్తారు. వెన్ను దశలో ఆశిస్తే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నివారణ ఇలా..

మొవ్వుపురుగు నివారణకు ఎస్ఫేట్ లీటరు నీటికి 1.5 గ్రాములు లేదా కార్టాఫ్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాముల మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి. ప్రస్తుత వాతావరణంలో అధిక ఉష్ణోగ్రత కారణంగా ఏర్పడే ఉక్కపోత, గాలివాటం కారణంగానే మొవ్వ తొలుచు పురుగు ఆశించడానికి అవకాశం అధికంగా ఉంది. అయితే ప్రస్తుతానికి అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో ప్రభావం పెద్దగా లేదన్నారు.

అక్కడక్కడా పొటాషియం లోపం

ప్రస్తుత ఖరీఫ్ వరి పంటలో అక్కడక్కడా పొటాషియం లోపాన్ని రైతులు గుర్తిస్తున్నారు. పొటాషియం లోపించిన వరి పంట ఆకులు నారింజరంగులోకి మారుతాయి. ఫలితంగా వరి పైరు పెరుగుదలపై ప్రభావం చూపుతుంది. దీని నివారణకు ఎకరాకు 40 కేజీలు పొటాష్‌ను రెండు దఫాలుగా చల్లుకోవాలి. మొదటి 20 రోజుల్లోపు 15 కేజీలు, అంకురం దశలో 25 కేజీలు పొటాష్‌ను చల్లుకోవాలి. ప్రస్తుతం పైరులో పొటాషియం లోపం కన్పిస్తే పొటాషియం నైట్రేట్‌ను ఎకరానికి అర కేజీ వంతున పిచికారీ చేయాలి.

మోతాదుకు మించితే ముప్పు



పిలక దశలో మొవ్వుకుళ్లు మరీ అంత ప్రమాదం కాదని రైతులు గుర్తించాలి. ప్రస్తుత పరిస్థితుల్లో తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కడా కనిపించడం లేదు. అక్కడక్కడా పొటాషియం లోపాన్ని గమనించాం. రైతులు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగు మందులు వాడరాదు. వర్షాలు పడుతున్నందున పంటకు కావాల్సిన నత్రజని సహజసిద్ధంగా అందుతుంది. ఈ విషయాన్ని రైతులు గమనించి అవసరం ఉన్న మేరకు వ్యవసాయశాఖ సూచనలకు అనుగుణంగా నత్రజని ఎరువును వాడాలి. అధికంగా నత్రజని వాడితే చీడపీడలు అధికంగా ఆశించడం, పంట చేతికందే సమయంలో చిన్నపాటి వర్షానికే నేలనంటే ప్రమాదం ఉంది. అధికంగా పురుగుమందుల వినియోగం మంచిది కాదు.

– కొప్పిశెట్టి ప్రభాకర్,
మండల వ్యవసాయాధికారి, రాయవరం

పేద చిన్నారులకు వైద్య సేవలు

రామచంద్రపురం: పట్టణంలో శనివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో వివిధ దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నియోజకవర్గంలో వైద్యం చేయించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేద చిన్నారులకు గుండె జబ్బులు, రక్తపోటు, దయాబెటిస్, రక్తహీనత, ఎముకల వ్యాధిగ్రస్తులకు డాక్టర్లు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వారికి శాశ్వత ప్రాతిపదికన శస్త్ర చికిత్సలు చేయిస్తామని మంత్రి తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంఈవో ఆఫీసుకు కంప్యూటర్ బహూకరణ



ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్‌ను అందజేస్తున్న విశ్వమానవత సంస్థ ప్రతినిధులు

రాయవరం: మండల విద్యాశాఖ కార్యాలయానికి విశ్వ మానవత సంస్థ కంప్యూటర్‌ను బహూకరించింది. విశ్వమానవత సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి రూ.25 వేల విలువైన కంప్యూటర్‌ను అందజేశారు. ఎంఈవో కార్యాలయంలో కంప్యూటర్ అవసరాన్ని మండల విద్యాశాఖ అధికారులు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణలు శ్రీనివాస చౌదరి దృష్టికి తీసుకుని వెళ్లారు. దీంతో ఆయన స్పందించి కంప్యూటర్‌ను ఎంఈవోలకు అందజేశారు. విశ్వమానవత సంస్థ సభ్యుడు గొలుగూరి మునిరెడ్డి, స్థానిక నేత వుండవిల్లి రాంబాబు పాల్గొన్నారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

- వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్
- స్మృతివనంపై దాడికి నిరసనగా ఆందోళన



ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న పిల్లి సూర్యప్రకాశ్, నాయకులు

రామచంద్రపురం రూరల్: విజయవాడలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనంపై అప్రజాస్వామికంగా దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని వైఎస్సార్ సీపీ రామచంద్రపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. స్మృతివనంపై దాడికి నిరసనగా శనివారం కో ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో శనివారం ద్రాక్షారామలో నిరసన తెలిపారు. తొలుత యానాం సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశ్ మాట్లాడుతూ విజయవాడలో సుమారు రూ.500 కోట్లతో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను తెలిపే మ్యూజియం వద్ద వాటిని ప్రారంభించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరు ఉండకూడదన్న ఉద్దేశంతో ఈ దాడి చేశారన్నారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని, దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసి హామీలను గాలికి వదిలేసిందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడుతూ చేస్తున్న అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎంపీపీ అంబటి భవాని మాట్లాడుతూ దళితుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకం తిరిగి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ జెడ్పీటీసీ ఇంత సంతోషం మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన దాడికి చంద్రబాబు, లోకేశ్‌లపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ద్రాక్షారామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వనుము వెంకట సుబ్బారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీటీసీ కొప్పిశెట్టి లక్ష్మణ్, సర్పంచులు నెర్లి బ్రహ్మాజీ, గంజా శ్రీదేవి, పిల్లి దొరబాబు, పంపన సత్యానందం, దళిత నాయకులు పెట్టా శ్రీనివాస రావు, మాతా మురళి, అంబటి తుకారం, బత్తుల అప్పారావు, గుబ్బల శ్రీనివాస్, వెంటపల్లి రామకృష్ణ, మాతా నూకారావు, పోతురాజు బాబూరావు, దడాల రవికుమార్, దడాల వెంకటరమణ, సాదే రాజేష్, బీసీ నాయకులు వాసంశెట్టి శ్యామ్, పంపన సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు



బాల్య వివాహాలు చేయరాదంటూ కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్ పీవో గజలక్ష్మి

రాయవరం: బాల్య వివాహం జరుగుతున్నట్టుగా వచ్చిన సమాచారంపై అధికారులు స్పందించారు. మండలంలోని వెదురుపాకలో శనివారం బాల్య వివాహం నిర్వహించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై మండల స్థాయి బాల్య వివాహాల నిరోధక కమిటీ ఆధ్వర్యంలో బాలిక, వరుడు కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అధికారి గజలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమన్నారు. బాల్య వివాహాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. మైనర్‌ను వివాహం చేసుకుంటే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష తప్పవన్నారు. వివాహ వయస్సు అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండి ఉండాలన్నారు. ప్రస్తుతం లగ్నాల సమయమని, బాల్య వివాహాలు ఎక్కడైనా నిర్వహిస్తే, అధికారుల దృష్టికి తీసుకుని రావాలని ఆమె సూచించారు. అంతకుముందుగా వివాహం నిశ్చయం చేసుకున్న బాలిక కుటుంబ సభ్యులకు, వరుడు కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.సునీత, అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సందడిగా జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు



విజేతలైన క్రీడాకారులు

మండపేట: పట్టణంలోని వేగుళ్ల సూర్యారావు ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శనివారం ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు కోలాహలంగా జరిగాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 110 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ కుంచె రమేష్ తెలిపారు. ఈ పోటీలకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజర య్యారు. బాలుర విభాగంలో మండపేటకు చెందిన చైతన్య వీరంజై, రాజమహేంద్రవరానికి చెందిన రమణ బాబు, కరప నుంచి సంతోష్, అమలాపురం క్రీడాకారుడు లక్ష్మణ్ విజేతలుగా నిలిచారని వివరించారు. బాలికల విభాగంలో వానపల్లి గ్రామానికి చెందిన అనిత కీర్తన లావణ్య, తునికి చెందిన దీప్తిశ్రీ , అనపర్తికి చెందిన అంకితలు విజేతలుగా నిలిచారని రమేష్ చెప్పారు. వీరంతా సెప్టెంబర్ నెలలో గుంటూరులో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్టు జిల్లా కార్యదర్శి ఎం నాగేశ్వరరావు చెప్పారు. విజేతలకు క్రీడా దుస్తులను రమేష్ బహూకరించారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



జాతీయ జెండాలను ఎగురవేయాలని చెబుతున్న బీజేపీ నాయకులు

మండపేట: పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని ఆ రోజున ప్రతి ఇంటిపైనా జాతీయ జెండాను ఎగుర వేసి దేశభక్తిని చాటాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా హర్ ఘర్ తిరంగా ఇన్‌చార్జ్ కంకటాల మురళీకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో మూడు రంగుల జెండాలను పంచి పెట్టారు. ఈ సందర్భంగా కోన సత్యనారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపైనా మువ్వన్నెల జెండాను ఎగుర వేయాలన్నారు. అనంతరం మెయిన్ రోడ్డులోని చిరు వ్యాపారులకు, షాపులకు, ఆటో డ్రైవర్లకు, చర్మకారులకు జెండాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వల్లభనేని రవీంద్రబాబు, మద్దుల సుబ్బారావు, రావూరి బాబూరావు, రామనుజన్ మాస్టారు, విశ్వ హిందూ పరిషత్ సభ్యుడు అయినవిల్లి రుద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.

మారిన సిలబస్ తగ్గించాలంటూ వినతి

బిక్కవోలు: విద్యార్థులకు మారిన సిలబస్ తిగ్గించాలంటూ విజయవాడలో రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ముల్లు రఘునాథరెడ్డికి వినతిపత్రం అందించారు. శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర ఎస్టీయూ సమావేశంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రాష్ట్ర ఎస్టీయూ ఆర్థిక కమిటీ సభ్యులు తమలంపూడి ఈశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్టీయూ పురపాలక కమిటీ సభ్యులు వర్ధినేని పళ్లంరాజు సంయుక్తంగా వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలల్లో 9, 10 తరగతి హిందీ, సాంఘికశాస్త్రం సబ్జెకులో సిలబస్ అధికంగా ఉండడం, విద్యార్థుల స్థాయి కి మించి సిలబస్‌ను పెట్టడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. కనీసం ఈ సంవత్సరం కొన్ని టాపిక్‌లు తగ్గించాలని కోరారు. విద్యార్థుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రాష్ట్ర ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి ముల్లు రఘు నాథరెడ్డికు తెలియజేశారు.

జీతాలు విడుదల చేయాలంటూ ధర్నా

కంబాలచెరువు: వెంటనే మూడు నెలల జీతాలు మంజూరు చేయలని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాలలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి గేటు వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు తాటిపాక మధు మాట్లాడుతూ సెక్యూరిటీ గార్డ్స్‌కు మూడు నెలలుగా జీతాలు అందలేదని, వారి ఇల్లు గడవడం కష్టంగా మారిందన్నారు. ఈ రోజుల్లో ఒక్కరోజు అద్దె పెండింగ్‌లో ఉన్నా ఇల్లు ఖాళీ చేయమంటున్నారని, చాలీచాలని జీతాలతో బతకడం కష్టమని వెంటనే జీతాలు అందించాలన్నారు.

విలువ కోల్పోయిన వ్యక్తి అప్పన్నబాబు

అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్



మీడియాతో మాట్లాడుతున్న రవికుమార్

మండపేట: ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విజయవాడ నడిబొడ్డున 206 అడుగుల ఎత్తులో డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్టింపచేసి యావత్ ప్రపంచాన్ని ఆంధ్ర రాష్ట్రం వైపు చూసేలా చేశారని మండపేట 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ మూకలు తప్పుడు చర్యలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో ఇప్పటికే విలువ కోల్పోయిన వార్డు స్థాయి నాయకుడు అప్పన్నబాబు తమ నాయకుడు జగన్ గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జెండా గుర్తుపై గెలిచిన అప్పన్నబాబు తర్వాత టీడీపీలో చేరి ప్రజలను మోసగించారని విమర్శించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడికి పితృ వియోగం



మురళి తండ్రి లక్ష్మణరావు మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణంలోని 28వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకుడు మొండి మురళికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి లక్ష్మణరావు (76) శనివారం అనారోగ్యంతో కన్నుమూశారు. మురళి పార్టీ నాయకుడిగాను, ఆయన భార్య భవాని కౌన్సిలర్‌గాను వార్డు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఈ దంపతులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి పరామర్శించారు. మురళీ తండ్రి లక్ష్మణరావు పార్థివ దేహానికి ఆమె పుష్పాంజలి ఘటించి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు నీలం దుర్గమ్మ, బొక్కా సరస్వతి, ఎర్నేని ప్రభావతి, మందపల్లి రవికుమార్, ఆ పార్టీ నాయకులు షేక్ అలీఖాన్‌బాబా, పేకేటి మాణిక్యం, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పరామర్శించి సంతాపం తెలిపారు. అలాగే 26 వార్డు కౌన్సిలర్ అమలదాసు లక్ష్మి బావ కుమార్తె ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మరణించడంతో వారి కుటుంబ సభ్యులను కూడా చైర్‌పర్సన్ దుర్గారాణి పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు.

కృత్రిమ కాలుకు రూ.14 వేల సాయం



బాధితుడికి కృతిమ కాలుకు సాయం అంజేస్తున్న కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదంలో కాలుపోయి కృత్రిమ కాలు కోసం సాయం అర్ధించిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు శనివారం రూ.14 వేల ఆర్థిక సాయం అందజేశారు. రాయవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన గనిశెట్టి సతీష్ లారీ క్లీనర్‌గా చేసేవారు 20 సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలికి తీవ్రగాయమయింది. ఇంతకాలం కాలికి ట్రీట్‌మెంట్ చేయించుకున్నారు. 3 నెలల క్రితం కాలు తీసేశారు. ఈయనకి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు, కృత్రిమ కాలు పెట్టించుకుని ఏదో ఒక పని చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలని అనుకుంటున్నారు. కృత్రిమ కాలు పెట్టించుకోవడానికి డబ్బులు లేని పరిస్థితి. దీంతో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. పసలపూడిలో సతీష్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.14 వేలు నగదు సాయంగా అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు బ్యాగుల పంపిణీ



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న కనికిరెడ్డి తదితరులు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం విద్యార్థులకు పుస్తకాలు బ్యాగులు పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసిన పుస్తకాలు బ్యాగులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి, సెక్రటరీ కె.నరేష్‌కుమార్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీ రమణ, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు .

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ

మామిడికుదురు: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు విరాళాలు సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం మామిడికుదురులో అంగన్‌వాడీ ఉద్యోగులు పలువురు దాతల వద్దకు వెళ్లి విరాళాలు సేకరించారు. కోనసీమ జిల్లా అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు బండి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో ఈ విరాళాలు సేకరిస్తున్నారు. సేకరించిన విరాళాలను అంగన్‌వాడీ యూనియన్‌కు అందజేస్తామని తెలిపారు. విరాళాల సేకరణలో అంగన్‌వాడీ యూనియన్ మండల శాఖ అధ్యక్షురాలు ఎన్.అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్లు వీఎంజీ కుమారి, ఎన్.రాజ్యలక్ష్మి, కె.మంగతాయారు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: అయినవిల్లి మండలంలోని నల్లచెరువు గ్రామంలో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున తోమల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసీ పూజ చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటికి బెల్లం తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ ముఖ్యం

మలికిపురం: యువత క్రమశిక్షణతో కూడిన డ్రైవింగ్ కలిగి ఉండాలని మలికిపురం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ సూచించారు. శనివారం మలికిపురంలో ప్రధాన రహదారులపై ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. వెహికల్ చెకింగ్‌లో ఐదు నంబర్ లేని మరియు సైలెన్సర్ లేని మోటార్ సైకిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎవరైనా సరే మోటార్ సైకిల్ కి డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా గాని నెంబర్ లేకుండా గాని సైలెన్సర్ లేకుండా గాని వెళ్లిన యెడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు.